క్లుప్తంగా

నిధుల మంజూరుపై హర్షం

చారకొండ: మండలంలోని జూపల్లి, చంద్రాయన్‌పల్లి, గోకారం, శేరి అప్పారెడ్డిపల్లి, ఎర్రవల్లి గ్రామాల అభివృద్ధి, సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.1.05 కోటి నిధులను ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి మంజూరు చేయించారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ బక్కమ్మ, డీసీసీ వైస్ ప్రెసిడెంట్ జూపల్లి వెంకటయ్య యాదవ్ మంగళవారం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఐదు సంవత్సరాల కాలంలో గ్రామాల అభివృద్ధికి ఎలాంటి నిధులు కేటాయించలేదని ఆయన పేర్కొన్నారు. అదేవిధంగా నిధులు మంజూరుపై ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

నేడు ఆలయ నిర్మాణానికి భూమిపూజ

పెంట్లవెల్లి: మండల కేంద్రంలో ఆకుతోట అభయాంజనేయ స్వామి దేవాలయ నిర్మాణానికి మంగళవారం భూమిపూజ నిర్వహిస్తున్నట్లు అర్చకులు లోకేశరాయ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.18 నిమిషాలకు శివాలయం, వినాయక, సుబ్రహ్మణ్యేశ్వర, నవగ్రహాల పూజలు అనంతరం భూమి పూజ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. భక్తులు, అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

విద్యార్థినికి అభినందన

తెలకపల్లి: జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఆంగ్ల పదజాల పోటీల్లో మండలంలోని గౌరెడ్డిపల్లి ఉన్నత పాఠశాల 10వ తరగతి విద్యార్థిని ఎం అంజలి ప్రతిభ కనబర్చింది. మొదటి స్థానంలో నిలిచి బహుమతి అందుకుంది. ఈ సందర్భంగా మంగళవారం పాఠశాలలో హెచ్‌ఎం మల్లికార్జున్, ఉపాధ్యాయులు, గ్రామస్తులు విద్యార్థిని అంజలిని అభినందించి సన్మానించారు.

అధ్యక్షుడిగా రామానుజం ఎన్నిక

పెద్దకొత్తపల్లి: ప్రైవేట్ స్కూళ్ల అసోసియేషన్ నియోజకవర్గ అధ్యక్షుడిగా బి రఘుపతి రెడ్డిని మంగళవారం ఎన్నుకున్నట్లు గౌరవాధ్యక్షుడు రామానుజం తెలిపారు. మండల కేంద్రంలోని లిటిల్ బర్డ్స్ పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో రామానుజం మాట్లాడారు. ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించి బహుమతులు అందజేస్తామన్నారు. అనంతరం నూతన కమిటీ సభ్యులను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో గాయత్రి పాఠశాల కరస్పాండెంట్ శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

పెంట్లవెల్లి: మండల కేంద్రంలోని ఆర్‌బీఎస్‌కే ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా పరిషత్ ఉన్నత బాలికల పాఠశాల విద్యార్థినులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ వినోద్‌కుమార్ ఆరోగ్యంపై పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ప్రతి ఒక్కరూ పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులకు బీపీ, షుగర్, టీబీ వంటి పరీక్షలు నిర్వహించారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

కల్వకుర్తిరూరల్: మండలంలోని మార్చాలకు చెందిన వెంకటయ్య గుండెపోటుతో మంగళవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న కల్వకుర్తి మాజీ సర్పంచ్ ఆనంద్‌కుమార్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.5వేలు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జిల్లెల్ల రాముడు, నిజాముద్దీన్, శ్రీధర్‌రెడ్డి, జంగయ్య గౌడ్, భాస్కర్, రమణగౌడ్ తదితరులు ఉన్నారు.

కూలి వెంటనే చెల్లించాలి



పెంట్లవెల్లి: మండలంలోని పలు గ్రామాల్లో పెండింగ్‌లో ఉపాధి కూలీలకు డబ్బులు వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఈశ్వర్ అన్నారు. మంగళవారం మండలంలోని గోవులాపూరంలో ఉపాధి కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూలి చెల్లించకపోవడంతో కూలీలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. కార్యక్రమంలో గంగన్న, లక్ష్మి, రజిత, రాజు, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన ఎస్‌ఐ

బల్మూర్: మండల నూతన ఎస్‌ఐగా బాలరాజు మంగళవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఎస్‌ఐ శేఖర్‌రెడ్డి వనపర్తి జిల్లా మదనాపురానికి బదిలీపై వెళ్లారు. ఉండవల్లి ఎస్‌ఐగా విధుల నిర్వర్తిస్తున్న బాలరాజు మండల కేంద్రానికి బదిలీపై వచ్చారు.

తహసీల్దార్, ఎంపీడీఓ బదిలీ

మండల రెవెన్యూ తహసీల్దార్ సలీమోద్దీన్ జోగులాంబ గద్వాల జిల్లాకు బదిలీ కాగా, ఎంపీడీఓ దేవన్న మహబూబ్‌నగర్ జిల్లాకు బదిలీపై వెళ్లారు.

మద్దతు ధర ఇవ్వాలని ధర్నా



మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు

నాగర్‌కర్నూల్‌రూరల్: వేరుశనగ పంటకు మద్దతు ధర ఇవ్వాలని డిమాండ్ చేస్తూ మంగళవారం తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో స్థానిక మార్కెట్ కమిటీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు వ్యవసాయ కమిటీ, మార్కెట్ కమిటీ, వ్యాపారులతో వాగ్వివాదానికి దిగారు. అనంతరం రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎం శ్రీనివాసులు మాట్లాడుతూ నాగర్‌కర్నూల్ జిల్లాలో వ్యాపారులు రైతులను మోసం చేస్తున్నారని ఆరోపించారు. వేరుశనగకు డిమాండ్ ఉన్నప్పటికి వ్యాపారస్తులు రైతులను మోసగిస్తున్నారని ప్రభుత్వం తక్షణమే ఆయిల్‌ఫెడ్ ద్వార కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. క్వింటాల్ వేరుశనగ ధాన్యాన్ని రూ.10వేలకు తగ్గకుండా కొనుగోలు చేయాలని కోరారు. రైతులనుంచి అధిక కమీషన్ వసూలు చేయొద్దన్నారు. మార్కెట్‌లో రైతులకు విశ్రాంతి గదులు ఏర్పాటు చేసి తక్కువ ధరకు భోజన వసతిని కల్పించాలన్నారు. రైతుసంఘం జిల్లా నాయకులు శివశంకర్, సభ్యులు వెంకటేష్, బాలరాజు, నరేందర్‌రెడ్డి, జంగయ్య, కిష్టయ్య, కురుమయ్య, శాంతయ్య, రైతులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో చండి హోమాలు



చండిహోమంలో పాల్గొన్న భక్తులు

కందనూలు: జ్ఞాన సరస్వతి దేవాలయం 13వ వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా నాల్గో రోజు మంగళవారం ఆలయ ఆవరణలో సామూహిక చండిహోమాలు భక్తిశ్రద్ధలతో కొనసాగాయి. అదేవిధంగా ఉదయం గురుదత్త హోమాన్ని నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నేడు వసంత పంచమి వేడుకలు

వసంత పంచమిని పురస్కరించుకొని జ్ఞాన సరస్వతి దేవాలయంలో తెల్లవారుజామున 6 గంటలకు అమ్మవారికి అభిషేకం, అనంతరం గోపూజ, సామూహిక కుంకుమార్చనలతో పాటు చిన్నారులకు అక్షరాభ్యాసాలు, అన్నప్రాసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు పి.నవీన్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 6 గంటలకు దేవాలయం నుంచి కొల్లాపూర్ చౌరస్తా వరకు సరస్వతి అమ్మవారి పల్లకి సేవలు, భజనలు, కోలాటాలతో, ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

సీఐకి సన్మానం



కల్వకుర్తిరూరల్: నూతన సీఐగా బాధ్యతలు స్వీకరించిన నాగార్జునను మాల మహానాడు నాయకులు మంగళవారం సత్కరించారు. అదే విధంగా ఊర్కొండ ఎస్‌ఐగా బాధ్యతలు చేపట్టిన వీరబాబు సీఐ కార్యాలయానికి రావడంతో ఆయనను శాలువాతో సన్మానించారు. శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల పాత్ర కీలకమైందని మాలమహానాడు నాగర్‌కర్నూల్ జిల్లా ఉపాధ్యక్షుడు రావుల శ్రీనివాస్ పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకుడు భగవంతు, వెంకటేష్, శేఖర్, అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిబంధనలు ఉల్లంఘించొద్దు



వెల్దండ: రోడ్డు భద్రతా నియమ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి హెచ్చరించారు. మంగళవారం మండల కేంద్రంలోని హైదరాబాదు–శ్రీశైలం జాతీయ రహదారిపై వాహనాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ శ్రీశైలం పుణ్యక్షేత్రానికి అధిక సంఖ్యలో వాహనాలు రాకపోకలు కొనసాగిస్తాయని వాహన దారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎదురుగా వస్తున్న వాహనాలను గమనిస్తు ముందుకు వెళ్లాలన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని కోరారు. కార్యక్రమంలో ఎస్‌ఐ రవి, సిబ్బంది తదితరులు ఉన్నారు.

భారత్‌బంద్ విజయవంతం చేయండి



మాట్లాడుతున్న కోళ్ళ ఏసయ్య

నాగర్‌కర్నూల్‌రూరల్: కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 16న దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న గ్రామీణ భారత్‌బంద్‌ను విజయవంతం చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కోళ్ళ ఏసయ్య పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ప్రజా సంఘాలతో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ 4 లేబర్ కోడ్‌లు ఏర్పాటు చేసి కార్మికుల శ్రమను దోచుకుంటుందని ఆరోపించారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కృష్ణాజీ, వ్యకాస జిల్లా అధ్యక్షుడు రవీందర్, మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు చిన్నపాగ శ్రీనివాసులు, హమాలీ సంఘం జిల్లా నాయకులు వాడాల బాలపీరు తదితరులు పాల్గొన్నారు.

చైర్‌పర్సన్‌పై దాడి అమానుషం



కొల్లాపూర్: అచ్చంపేట మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ అరుణపై దాడికి పాల్పడడం అమానుషమని వాసవీక్లబ్ మహిళా నాయకురాలు ఆకుతోట కుసుమ, నిర్మల అన్నారు. మంగళవారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రైతుల ముసుగులో కొందరు వ్యక్తులు చైర్‌పర్సన్‌పై దాడికి పాల్పడడం దారుణమన్నారు. ఈ ఘటన సభ్యసమాజానికి సిగ్గుచేటన్నారు. దాడికి పాల్పడ్డ వారిని అరెస్టుచేయాలని వారు డిమాండ్ చేశారు. దాడిని ప్రజాస్వామ్యవాదులంతా ఖండించాలని కోరారు. సమావేశంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు ఆకుతోట సుదర్శన్‌శెట్టి, శేషయ్యశెట్టి, శివనారాయణ, సాయిబాబా, ప్రదీప్ శెట్టి, నిర్మల, వాణి, మాదురి తదితరులున్నారు.

మొక్కలను రక్షించాలి



తాడూరు: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాలలో నాటిన మొక్కలను రక్షించాలని ఎంపీడీఓ గంగమోహన్ అన్నారు. మంగళవారం మండలంలోని గుంతకోడూరు, యంగంపల్లి గ్రామాల్లో పంచాయతీ ట్యాంకర్ ద్వారా నాటిన మొక్కలకు నీటిని అందించారు. కార్యదర్శితో పాటు ఫీల్డ్ అసిస్టెంట్లు, అంగన్‌వాడీ వర్కర్లు, ఆశావర్కర్లు గ్రామాలలో వివిధ సమస్యలను గుర్తించి వాటి పరిష్కారంలో ప్రత్యేక శ్రద్ధ కనబరచాలన్నారు. నాటిన ప్రతి మొక్కకు వేసవిని దృష్టిలో ఉంచుకుని ప్రతి రోజు ట్యాంకర్ల ద్వార నీటిని అందించాలన్నారు. పారిశుద్ధ్యంపై దృష్టి సారించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై సంతతో ఇబ్బందులు

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలో పెద్దకార్పాముల రోడ్డుపై కూరగాయల వారాంతపు సంతను నిర్వహిస్తున్నారు. దీంతో వాహనదారుల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. పాత గ్రామంలోకి మార్పు చేస్తే పెద్దకార్పాముల, దేదినేనిపల్లి, చిన్న కొత్తపల్లి, జగన్నాథపురం, పెద్దకార్పాముల, యాపట్ల, అంబటిపల్లి గ్రామాల ప్రజలకు ప్రయాణించేందుకు సౌకర్యంగా ఉంటుంది. ఈ సంతను మార్పు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

వ్యక్తిపై దాడి

నాగర్‌కర్నూల్ క్రైం: మండలంలోని ఎండబెట్లలో ఓ వ్యక్తిపై దాడికి పాల్పడిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన హుసేన్‌కు సంబంధించిన మేకలను గ్రామ శివారు పొలానికి తీసుకెళ్లాడు. అక్కడే ఉన్న నలుగురు వ్యక్తులు అకారణంగా హుసేన్‌పై దాడికి పాల్పడటంతో గాయాలయ్యాయి. చికిత్స కోసం బాధితుడిని జనరల్ ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న శివస్వాములు ఆస్పత్రికి చేరుకొని ఆందోళన నిర్వహించారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళనకారులు శాంతింపజేశారు.

జేఈఈ మెయిన్స్‌లో నల్లమల విద్యార్థులు ప్రతిభ



సమీర్



రాహుల్



కె.ప్రదీప్

అచ్చంపేట రూరల్: జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో అచ్చంపేట ప్రాంతానికి చెందిన విద్యార్థులు సత్తాచాటారు. పట్టణంలోని టీచర్స్ కాలనీకి చెందిన ఎండీ సమీర్ మొదటి సెషన్‌లో ఎన్‌టీఏ 99.866 శాతం మార్కులు, అదేవిధంగా జి. రాహుల్ 93.21శాతం మార్కులు సాధించాడు. విద్యార్థులను పలువురు అభినందించారు.

దోమలపెంట: నల్లమల విద్యార్థి కెతావత్ ప్రదీప్ మంగళవారం వెలువడిన జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో ప్రదీప్ 81.77 శాతం మార్కులు సాధించాడు. ఎన్ఐటీ, ఐఐఐటీలో ప్రవేశానికి అర్హత సాధించాడు. విద్యార్థి ప్రదీప్ ఈగలపెంటలో నిర్వహిస్తున్న డీఏవీ ఆంగ్లపాఠశాలలో నాలుగవ తరగతి నుంచి పదివరకు విద్యను అభ్యసించాడు. ప్రదీప్ తండ్రి కె.బిక్కులాల్ భూగర్భ కేంద్రంలో జేపీఏగా విధులు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా డీఏవీ పాఠశాల ప్రిన్సిపాల్ ప్రసాద్, ఉపాధ్యాయులు ప్రదీప్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

ఘనంగా సరోజనీనాయుడు జయంతి



నాగర్‌కర్నూల్‌లో మెమెంటోలు అందజేస్తున్న నిర్వాహకులు

కందనూలు: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సరోజనీ నాయుడు జయంతిని పురస్కరించుకొని మంగళవారం జిల్లా ఆంగ్ల ఫోరం ఆధ్వర్యంలో ఆంగ్ల పదజాల, డ్రామా పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంగ్ల ఫోరం జిల్లా అధ్యక్షుడు కంచర్ల శివప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు దీటుగా ఆంగ్లంలో రాణిస్తున్నారన్నారు. సరోజినీ నాయుడు భారతదేశ మొట్టమొదటి గవర్నర్‌గా, అఖిల భారత జాతీయ కాంగ్రెస్ మహాసభ మొదటి మహిళా అధ్యక్షురాలుగా పని చేశారని గుర్తు చేశారు. అనంతరం విజేతలకు క్లాస్‌మెట్ క్లబ్ ఆధ్వర్యంలో మెమోంటోలు అందజేశారు. కార్యక్రమంలో కూన రవికుమార్, ఆర్ సురేందర్, శ్రీదేవి, కంచర్ల శ్యాంసుందర్, ఆంగ్ల ఫోరం జిల్లా ప్రధాన కార్యదర్శి బ్రహ్మయ్య, ఆంగ్ల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బల్మూర్: మండలంలోని కొండనాగుల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం జాతీయ మహిళ దినోత్సవం సందర్భంగా సరోజినీనాయుడు జయంతిని నిర్వహించారు. మహిళ సాధికారత విభాగం ఆధ్వర్యంలో ఆమె చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సీహెచ్ రామచంద్రం మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో మహిళ సాధికారత అధ్యక్షురాలు ముంతాజ్‌బేగం, సభ్యులు గాయత్రి, లలిత, ఫర్జానా, రేణుక, కళాశాల సిబ్బంది పరంగి రవి, అశోక్, జాన్‌బాబు, వెంకటయ్య, కృష్ణగోపాల్ విద్యార్థులు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరా లేక ఇక్కట్లు

పెద్దకొత్తపల్లి: మండలంలోని వివిధ గ్రామాల్లో మిషన్ భగీరథ నీరు సరఫరా కాక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు పట్టించుకొని నీటిని సక్రమంగా సరఫరా చేయాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. మండల కేంద్రంలో మూడు రోజులుగా సాగు నీటి సరఫరా లేక ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. మిషన్ భగీరథ నీటిని వెంటనే సరఫరా చేయాలని స్థానికులు కోరుతున్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

కల్వకుర్తి టౌన్: పట్టణంలోని జేపీనగర్ గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థులు జాతీయస్థాయిలో నిర్వహించే అథ్లెటిక్ పోటీలకు ఎంపికైనట్లు జిల్లా గురుకులాల అధికారి దానం తెలిపారు. మంగళవారం పాఠశాలలో పోటీలకు ఎంపికైన అజయ్, సంతోష్, మల్లేష్, అనిల్‌లను ఆయన అభినందించారు. ఈ నెల 15 నుంచి 17వ తేదీ వరకు గుజరాత్ రాష్ట్రంలోని నరేంద్రమోడీ స్టేడియంలో నిర్వహించే పోటీలలో విద్యార్థులు పాల్గొంటారని వివరించారు. జాతీయస్థాయిలో ప్రతిభ కనబర్చి రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. పీడీ షంషీర్ అలీ, పాఠశాల ఉపాధ్యాయులు ఉన్నారు.

విద్యార్థులు ఉపాధ్యాయులైన వేళ



ఊర్కొండలో ఉపాధ్యాయులతో విద్యార్థులు



దోమలపెంటలో..

ఊర్కొండ: మండలంలోని ఊర్కొండపేట జిల్లా పరిషత ఉన్నత పాఠశాలలో విద్యార్థులు స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా 35 మంది విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. డీఈఓగా మాసుంబాబ, హెచ్‌ఎంగా నేహ తబస్సుం వ్యవహరించి ఆకట్టుకున్నారు. హెచ్‌ఎం శ్రావణ్‌కుమార్, ఉపాధ్యాయులు, హబీబా మున్నిసావబేగం, శివకుమార్, పత్య, శ్రీనివాసరావు, యాదయ్యగౌడ్, జగ్యా, భరత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

లింగాల: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులే ఛాత్రోపధ్యాయులుగా వ్యవహరించారు. విద్యాశాఖ మంత్రిగా కె. అఖిల్‌రాజు, కలెక్టర్‌గా ఎస్.మణిశరణ్, డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్‌గా జస్వంత్, డీఈఓగా నవ్య, ఆర్‌జేడీగా కె.కవిత, డిప్యూటీ డీఈఓగా కె.హారిక, ఎంఈఓగా ఎండీ కబీర్‌తో పాటు మరో 56 మంది ఉపాధ్యాయులు విధులు నిర్వర్తించి ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ ప్రేమ్‌కుమార్, హెచ్‌ఎం శేఖర్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

దోమలపెంట: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు మంగళవారం స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి పాఠాలు బోధించారు. ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు అందజేశారు. హెచ్‌ఎం నాగయ్య, ఉపాధ్యాయులు శంకర్, స్టెల్లా, శిరీష, మల్లయ్య, ఈశ్వరయ్య, శ్రీధర్, కంప శ్రీనివాసులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించాలని వినతి



కలెక్టరేట్ ఏఓ హనుమంతునాయక్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న నాయకులు

నాగర్‌కర్నూల్‌రూరల్: కలెక్టరేట్ పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి వెంటనే వేతనాలు చెల్లించాలని మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఏఓ హనుమంతుకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి పి రామయ్య మాట్లాడుతూ కలెక్టరేట్ భవనంలో 14 మంది పారిశుద్ధ్య కార్మికులు పనిచేస్తున్నారని వారికి మూడు నెలలుగా జీతాలు ఇవ్వడం లేదని వివరించారు. పీఎఫ్, ఈఎస్ఐ అమలు చేయకుండా శ్రమదోపిడీకి పాల్పడుతున్నారని ఆరోపించారు. రాష్ట్రంలోని వివిధ కలెక్టరేట్ కార్యాలయాల్లో పనిచేస్తున్న సిబ్బందికి రూ.12500 వేతనం ఇస్తున్నారని నాగర్‌కర్నూల్ కలెక్టరేట్‌లో పనిచేస్తున్న కార్మికులకు రూ.8500 వేతనం మాత్రమే చెల్లిస్తున్నారన్నారు. వేతనాలు రాకపోతే ఎలా బతుకుతారని ప్రశ్నించారు. తక్షణమే పెండింగ్ వేతనాలను చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంట్రాక్ట్ కార్మికులు అలివేలమ్మ, కృష్ణవేణి, సుజాత, జరీనా, గౌస్య, భాగమ్మ, ఎల్లమ్మ, మంజుల, వెంకటమ్మ, అనసూయ తదితరులు పాల్గొన్నారు.

వాల్ పోస్టర్ విడుదల



చారకొండ మండలం జూపల్లిలో..

చారకొండ: ఈ నెల 16న దేశ వ్యాప్తంగా నిర్వహించనున్న సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని వ్యవసాయ కార్మికశాఖ ఉపాధ్యక్షుడు బాలస్వామి అన్నారు. మండలంలోని జూపల్లిలో మంగళవారం సమ్మెకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ కార్మికులు, దాసు, దయా, అర్జున్ ఉన్నారు.

తాడూరు: ఈ నెల 16న నిర్వహించే సార్వత్రిక సమ్మెకు సంబంధించి వాల్‌పోస్టర్‌ను మంగళవారం మండల కేంద్రంలో కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు కాశన్న విడుదల చేశారు. కార్యక్రమంలో కేవీపీఎస్ నాయకులు రాజు, ఎల్లమ్మ, శేషమ్మ, కుర్మయ్య, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఈదమ్మ జాతర ఉత్సవాలు ప్రారంభం

కొల్లాపూర్: పట్టణంలో ఈదమ్మ జాతర ఉత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభమయ్యారు. ఐదు మంగళవారాల పాటు జాతర కొనిసాగనుంది. తొలి రోజున భక్తులు దేవతకు బోనాలతో నైవేద్యాలు సమర్పించారు. కోళ్లు, పొట్టేళ్ల బలి ఇచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. ఉత్సవాలను రైతు సంఘాల నాయకులు పర్యవేక్షించారు.

వంశీచంద్‌రెడ్డిని కలిసిన నాయకులు

వెల్దండ: పాలమూరు న్యాయ యాత్ర చేపట్టిన సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితులు చల్లా వంశీచంద్‌రెడ్డిని మంగళవారం మండల కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా కల్వకుర్తి నియోజకవర్గంలోని అన్ని గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక దృష్టిపెట్టాలని నాయకులు ఆయనను కోరారు. కార్యక్రమంలో జిల్లా ఎస్టీ సెల్ కో కన్వీనర్ పాండునాయక్, నాయకులు రమేష్ నాయక్, జగన్, తదితరులు ఉన్నారు.

నర్సరీల పరిశీలన



తాడూరు: మండలంలోని పాలుమూరు, గుట్టలపల్లి గ్రామాలలో ఉపాధి హామీ పథకం ద్వారా ఏర్పాటు చేసిన నర్సరీలను ప్రత్యేకాధికారి సాయిరమేష్‌కుమార్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కార్యదర్శులకు సూచించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి సుధాకర్, ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీనివాసులు ఉన్నారు.

నల్లగొండ సభకు తరలిన బీఆర్ఎస్ శ్రేణులు



కొల్లాపూర్ నుంచి బయలుదేరిన నాయకులు

సాక్షి, నెట్‌వర్క్: కృష్ణానదిపై నిర్మించిన ప్రాజెక్టుల పరిరక్షణ కోసం బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం నల్లగొండలో నిర్వహించిన భారీ బహిరంగ సభకు ఆ పార్టీ నాయకులు పలు మండలాల నుంచి తరలివెళ్లారు. కల్వకుర్తి, కొల్లాపూర్, ఉప్పునుంతల, చారకొండ, పెంట్లవెల్లి, వెల్దండ మండలాల నుంచి ప్రైవేట్ వాహనాలలో బయలుదేరారు. కార్యక్రమంలో కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, మాజీ సర్పంచ్‌లు జంగయ్య, కృష్ణయ్య, గోపాల్, కొల్లాపూర్ నుంచి రాంచందర్ యాదవ్, కాటం జంబులయ్య, ఉప్పునుంతల, చారకొండ, పెంట్లవెల్లి బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రవీందర్‌రావు, రవీందర్, పోతుల వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీపీ పుట్ట రాంరెడ్డి కార్యకర్తలు ఉన్నారు.